

## అనాథాశ్రమానికి 'మిట్స్' చేయూత

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మిట్స్ కళాశాల సోషల్ రెస్పాన్సిబుల్ క్లబ్ ద్వారా కదిరిలోని సేవా భారతి అనాథ శరణాలయానికి గురువారం సోలార్ లైట్, ప్రొజెక్టర్ స్క్రీన్, రెండు ఫ్యాన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ కో -ఆర్డినేటర్ షాహీద్ అహమ్మద్ మాట్లాడుతూ అనాథ పిల్లలకు భోజనం కూడా ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు గ్రూప్‌గా ఏర్పడి రూ. 25 వేలు సేకరించి ఆశ్రమానికి అవసరమైన వస్తువులను అందజేశామన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, అయినవాళ్లు చూడక, నిరాదరణకు గురై, నిరాశ్రయులైన బాలలకు వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని తమ వంతు సాయం చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ఆశ్రమానికి ఫ్యాన్ అందజేస్తున్న కో-ఆర్డినేటర్

# హామీల అమలులో విఫలం

- సూపర్‌సిక్స్‌ను పక్కాగా అమలు చేయాలి
- ప్రజలపై విద్యుత్‌భారం తగ్గించాలి
- ధరలను అదుపు చేయాలి
- 'ముదివేడు' భూ బాధితులకు పరిహారం వెంటనే చెల్లించాలి
- కలెక్టరేట్ ఎదుట మహాధర్నాలో సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ముదివేడు బాధితులు, సిపిఎం నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈనెల 8 నుండి 14 వరకు సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం రాయచోటి కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ముందుగా ముదివేడు రిజర్వాయర్ నిర్మాణానికి భూములిచ్చి తీవ్ర నష్టపోయిన రైతులతో సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం నాయకులతో కలెక్టరేట్ చేరుకొన్న రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలెక్టరేట్ లోకి బైక్‌లతో చొచ్చుకొని వెళ్లేందుకు చొరవడగా పోలీసులు నిలువరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ ప్రజాపోరులో భాగంగా కాలనీలను సందర్శించి ప్రజా సమస్యలతోపాటు ప్రాజెక్టులు పరిశీలించి వాటి లోటు పాట్లపై ఆరా తీశామన్నారు. ముఖ్యంగా ముదివేడు రిజర్వాయర్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నష్ట పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాయని పేర్కొన్నారు. మూడేళ్లుగా సంవత్సరాలుగా అనేక రూపాల్లో పోరాటం చేసిన రైతులు నష్ట పరిహారం చెల్లించకపోవడం దారుణమని వాపోయారు. ఏడాదికి మూడు సార్లు పండించే భూములు తీసుకొని, పరిహారం ఇవ్వకుండా పాసు బుక్కుల మీద రుణాలు తీసుకోనివ్వకుండా నట్టేట ముంచు తున్నారని రైతులు వాపోయారు. పట్టణంలో మూడు వేలకు పైగా మైనారిటీ మహిళా బీడీ కార్మికులున్నారని, వారికి గుర్తింపు కార్డులతో పాటు వైద్య సదుపాయాలు కల్పించలేదని వాపోయారు. కూలి రెట్లు పెంచకపోవడంతో ఇక్కట్లకు లోనవుతున్నారని తెలిపారు. వీరికి ప్రత్యేక రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. చిత్తూరు రోడ్డులోని ఎస్‌టి కాలనీలో తాగునీటి సమస్య అధికంగా ఉందని ఎగువ ప్రాంతానికి నీరు సరఫరా కాలేదని వాపోయారు. 50 కుటుంబాలు నీటి కోసం పనులు మానుకొని ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ప్రత్యామ్నాయ పద్ధతిలో సింటెక్స్‌లు ఏర్పాటుచేసి నీరివ్వాలని, డ్రెయినేజీకి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన స్పందించి ముదివేడు భూ బాధితులతో పాటు, బీడీ కార్మికులు, ఎస్‌టి కాలనీ వాసుల సమస్యలు త్వరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు, శాఖ కార్యదర్శి టీ. హరిశర్మ, మాధవయ్య, నాగబసిరెడ్డి, భాస్కర్, సిద్దిమల్లు, రామచంద్ర, ఆంజనేయులు, కిరణ్, రైతులు శంకర్ రెడ్డి, బీడీ కార్మికులు, ఎస్టీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే
# అధిక ప్రాధాన్యత

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను కల్పిస్తోందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం నిమ్మనపల్లి మండలంలోని స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో సిఎంఒ పిజిఆర్‌ఎస్ దరఖాస్తులు, విద్యార్థులకు ఆపార్ ఐడి జనరేషన్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఇండ్ల నిర్మాణ ప్రగతి, ఎన్పిసిఐలో బ్యాంకు అకౌంట్లకు ఆధార్ లింక్ వంటి అంశాలపై మదనపల్లె హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్రతో కలిసి తహశీల్దార్, ఎంపిడిఒ, డిటిలు, విఆర్‌ఒలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎపిఎం, ఇతర మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా ప్రజా సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో, నాణ్యతగా, చట్ట ప్రకారం నిష్పక్షపాతంగా పరిష్కరించాలని అన్నారు. చుక్కల భూములు, ఇనాం భూములు, ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ పరిశీలన వేగంగా, పక్కాగా, పారదర్శకంగా విచారణ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థులకు ఆపార్ ఐడి జనరేషన్ జరుగుతున్నాదని, అందులో విద్యార్థులకు అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో నోటరీలు లేకుండా వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఆపార్ ఐడి జనరేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. పక్కా గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు.నిమ్మనపల్లె మండలంలో సిఎంఒ పిజిఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో, పక్కా గృహాల నిర్మాణాలలో ఆపార్ ఐడి జనరేషన్‌లో అధికారుల పనితీరు బాగుందని అభినందించారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సంబంధించిన అధికారులకు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం అగ్రహారం గ్రామంలో భూ రీసర్వే సందర్భంగా ఏర్పాటుచేసిన సర్వే రాయిపై అక్షరాల బొమ్మను చెరిపి వేయించారు. రీ సర్వే జరిగిన అన్ని ప్రాంతాలలోనూ ఏర్పాటుచేసిన సర్వే రాళ్లపై అక్షరాల బొమ్మలను చెరిపి వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ముష్టూరు గ్రామంలో ఓ రైతు పిజిఆర్‌ఎస్ లో దరఖాస్తు చేసుకున్న భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన విధంగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఇసుక అవసరమైన ప్రజలు వారికి అందుబాటులో ఉన్న ప్రాంతాల నుంచి కూలీలతో ట్రాక్టర్ లోడ్ చేసుకుని ఉచితంగా ఇసుకను తరలించుకోవచ్చు అన్నారు. ఇసుక రవాణాలో జెసిబి, హిటాచి, టిప్పర్ వంటి యంత్రాలను ఉపయోగించరాదని, పెద్ద మొత్తంలో ఇసుక నిల్వ ఉంచరాదని తెలిపారు. రీచ్ నుంచి టిప్పర్ ద్వారా ఇసుకను తరలించుకోవచ్చు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం తీసుకువచ్చిన ఇసుక ఉచిత విధాన పాలసీ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అందరికీ అందేలా చూడాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల సాయంతో ఇసుకను తరలిస్తే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.కార్యక్రమంలో మదనపల్లె హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, ఎంపిపి నరసింహులు, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, డ్వామా పీడీ వెంకటరత్నం, ఎపిడి శ్రీనివాసులు, తహసిల్దార్ ధనుంజయలు, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఎస్ఐ తిప్పేస్వామి, ఎటిఎం మురళి, ఎపిఒ రమేష్, ఎఒ రమేష్ బాబు, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# 'వద్రా'పై కేసుల పరంపర

- నందలూరు పిఎస్‌లో మరో కేసు
- పులివెందుల పిఎస్‌కు బదలాయింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలైన వర్రా రవీంద్రారెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి, సిరిగిరెడ్డి అర్జున్‌రెడ్డిలపై కేసుల పరంపర కొనసాగుతోంది. ఈమేరకు అన్నమయ్య జిల్లా నందలూరు పిఎస్‌లో ఈనెల 8 న సిద్ధవటం మండలానికి చెందిన వాకమల్ల వెంకటాద్రి అనే దళితుడు అన్నమయ్య జిల్లా నందలూరు పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈమేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిరో ఎఫ్ఐఆర్ కింద ఎస్‌సి, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి పులివెందుల పోలీసుస్టేషన్‌ను బదిలీ చేశామన్నారు. ఇదిలాఉండగా సదరు వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలు 2020 నుంచి రాష్ట్రంలోని రాజకీయ ప్రముఖులైన నారా చంద్రబాబు, నారాలోకేష్, హోంమంత్రి అనిత, పవన్‌కల్యాణ్,



వై.ఎస్ షర్మిల, వైఎస్ సునీత, వైఎస్ విజయమ్మలపై సోషల్ మీడి యాలో అనుచిత పోస్టులు పెట్టడంపై ఫిర్యాదుల పరం పరం కొనసాగు తుండడం గమనార్హం. ఇందులో భాగంగానే ఈనెల 11న పోలీసులు వర్రా రవీంద్రరెడ్డి సహా మరో ఇద్దరిని అరెస్టు చేసిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి కార్య కర్తలు పలువురు వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కేసులు నమోదు చేయడం, నోటీసులు జారీ చేయడంతో పరిస్థితి పతాకస్థాయికి చేరు కోవడం గమనార్హం.

# మూడు దశాబ్దాల ఉద్యమ ఫలితమే వర్గీకరణ

ఎంఆర్‌పిఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మందకృష్ణ మాదిగ



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మూడు దశాబ్దాల పోరాట ఫలితమే ఎంఆర్‌పిఎస్ ఎస్‌సి వర్గీకరణ విజయమని సాధించిందని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. మదనపల్లె పట్టణంలో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మందకృష్ణ మాదిగకు ఎమ్మార్పీస్ శ్రేణులు స్వాగతం పలికారు. స్థానిక నిమ్మనపల్లి రోడ్డు సర్కిల్ నుంచి సభ ప్రాంగణం చౌడేశ్వరి కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బళ్లారి డ్రమ్స్, బాణాసంచా కాల్చారు. అనంతరం చౌడేశ్వరి కళ్యాణంమడపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ ఉద్యమం ఈనాటిది కాదని, దశాబ్దాల నాటిదని తెలిపారు. ఆరు దశాబ్దాల కిందట ప్రారంభమైన ఎస్సీ వర్గీకరణ మూడు దశాబ్దాల నుంచి పోరుబాట అందుకుందన్నారు. ఎన్ని కమిషన్లు వచ్చినా.. వర్గీకరణకు అనుకూలంగానే రిపోర్టులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అన్ని పార్టీలు, సమాజం సైతం వర్గీకరణకు మద్దతు ఇచ్చినప్పటికీ శక్తిమంతమైన మాల మాత్రం ఎస్‌సి వర్గీకరణ అడ్డుకుంటూనే వస్తోందన్నారు. ఎస్‌సి లో59 ఉప కులాలు ఉండగా కేవలం మాల వర్గం మాత్రమే వర్గీకరణ అడ్డుకుంటోందంటే, అందులో ఉన్న అంత్రయమేమిటో గ్రహించాలన్నారు. 59 ఉపకులాలు ఉండగా 90 శాతం ఫలాలు కేవలం మాల వర్గం మాత్రమే అనుభవించిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉద్యమం వ్యాపించడంతో అన్ని రాష్ట్రాల్లోను ఏర్పాటు కమిషన్లు ఎస్‌సి వర్గీకరణ జరగాలి్సందేనని రిపోర్టు ఇవ్వడం ప్రధాని నరేంద్ర మోడి హామి ఇవ్వడంతో సుప్రీంకోర్టు జిజెఐ చంద్రచూడ్ వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. రాబోయే కొద్ది రోజుల్లోనే మన బిడ్డలు రిజర్వేషన్ల ఫలాలు అందుకోబోతున్నారని తెలిపారు. మనకు అండదండలు అందించిన సమాజానికి రుణపడి ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కమిషన్ల రిపోర్టులను అడ్డుకున్న మాల వర్గం ఇప్పటికైనా కలిసి వచ్చి వర్గీకరణకు సహకరించాలని కోరారు. తద్వారా పెండింగ్‌లో ఉన్న ఎన్నో సమస్యలను కలిసి పోరాడి సాధించుకోవచ్చని పిలుపునిచ్చారు. అనతి కాలంలోనే వర్గీకరణ ఫలాలు అందబోతున్నాయని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర మాదిగ, ఆలేటి వాసు, రాజా, రవీంద్ర, మనోహర్, చిన్న, శ్రీనివాసులు, గంగాధర్, దేగాని కుమార్ పాల్గొన్నారు.

# పల్లె పండుగ పనులపై దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

పల్లె పండుగ పనులపై దృష్టి సారించి పురోగతి సాధించాలని, తహశీల్దార్లు, ఎంపిడిఒలు ప్రభుత్వ ప్రాధాన్యత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సిబ్బంది, ఎంఇలతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలు, పల్లె పండుగ పనులు, విద్యార్థులకు అపార్ ఐడీల మంజూరు, సర్వే రాళ్లపై బొమ్మల తొలగింపు, తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దార్లు పిజిఆర్‌ఎస్ అర్జీదారులతో తప్పనిసరిగా మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో అర్జీలను పరిష్కరించాలన్నారు. ఆధార్ మంజూరు కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ వారికి కేటాయించిన రహదారుల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంఇఒలు, ఎంపిడిఒలు సమన్వయంతో విద్యార్థులకు అపార ఐడీలను త్వరగా మంజూరు చేయాలన్నారు. కొన్ని మండలాలలో విద్యార్థుల హాజరు తక్కువగా ఉందని దీనిపై దృష్టి సారించాలన్నారు. సర్వే శాఖ సిబ్బంది సర్వే రాళ్లపై ఉన్న చిత్రాలను తొలగించే పనిలో పూర్తిగా నిమగ్నమై త్వరితగతిన చిత్రాలను తొలగించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

# చలో విజయవాడను జయప్రదం చేయండి : ఎస్‌ఎఫ్‌ఐ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 18న ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చలో విజయవాడ మహాధర్నా జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాయచోటి పట్టణ అధ్యక్షుడు సాయి, పవన్‌నాయుడు అన్నారు. గురువారం డైట్ స్కూల్ ఆవరణంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల కోసం, హక్కుల సాధన కోసం పోరాటాలే మార్గమని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,480లు, విద్యా దీవెన, వసతి దీవెన బాకాయలు విడుదల చేయాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించి పెరిగిన ధరలకు అనుకూలంగా సంక్షేమ హాస్టల్స్‌లో రూ.3వేలు మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు.తల్లికి వందనం డబ్బులు ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని కోరారు. జిఒ నెంబర్ 77 రద్దుచేసి పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజు రిఎంబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలన్నారు. డిగ్రీలో మేజర్ మైనర్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు గురునాథ్, శివాజీ, సన్నీ, నరసింహ, తిరుమల నాయుడు, నాగేంద్ర, అమర్ పాల్గొన్నారు.

# ముందస్తు వైద్య పరీక్షలతోనే కేన్సర్‌కు చెక్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ముందస్తు ఆరోగ్య పరీక్షలతో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చునని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారిణి జులేఖబేగం అన్నారు. గురువారం మండలంలోని విఠలం గ్రామంలో కేన్సర్ వ్యాధిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన వ్యాధిని గుర్తించడం ద్వారా తొలి దశలోనే రోగాలను నివారించవచ్చునని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి క్యాన్సర్ వ్యాధి అవగాహనపై ముద్రించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి సూపర్‌వైజర్ నాగిరెడ్డి, పిహెచ్‌సి సూపర్‌వైజర్ సుధాకర్, సిబ్బంది మురళి, రెడ్డెమ్మ, పాల్గొన్నారు. **పీలేరు :** ముందస్తు వైద్య పరీక్షలతో కేన్సర్‌కు చెక్ పెట్టవచ్చని జిల్లా అర్‌బిఎస్‌ఎన్‌సిడి కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ శివ ప్రతాప్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఆరోగ్య సర్వే ఎన్ సి డి 3.0 కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దే చేపట్టే కేన్సర్‌పరీక్షల కార్యక్రమాన్ని గురువారం ఆయన పీలేరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ఇంటింటికి వస్తున్న ఆరోగ్య అధికారులచే సమగ్ర ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని, అంతర్గతంగా దాగివున్న వివిధ ఆరోగ్య సమస్యల నిర్ధారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. లక్షణాలు తెలియని కొన్ని రకాల జబ్బులు డయాబెటిస్, అధిక రక్తపోటు, హిమోగ్లోబిన్, నిర్ధారణతో పాటు , మంచి ఆరోగ్యం మనకు ఎలా సాధ్యమో ఆరోగ్య సిబ్బంది వివరిస్తారని అన్నారు. కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని, వ్యాధి రహిత ఆంధ్రప్రదేశ్‌కు సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తలుపుల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్‌ఎం భార్గవి, రేణుక, సిహెచ్‌ఒలు చంద్రకళ, రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.






వాల్మీకిపురం : వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

# వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయండి

- డయాలసిస్ సెంటర్ అందుబాటులో ఉంచాలి
-అసెంబ్లీలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

కలికిరిలో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో లేవనెత్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి 2013 వ సంవత్సరంలో వాల్మీకిపురం, పీలేరు, కలికిరి మండలాల్లో ప్రజలకు అందుబాటులో మూడు చోట్ల వందల పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని జిఒ జారీ చేశారని వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వారు వాల్మీకిపురం పీలేరులో మాత్రమే వంద పడకల ఆసుపత్రులు నిర్మించారని అన్నారు. కలికిరిలో జిఒను రద్దు చేయడం జరిగిందని ఆయన అసెంబ్లీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడికి విన్నవించుకున్నారు. కలికిరిలో సిఆర్‌పిఎఫ్, ఐటిబిపి, జేఎన్టీయూ, సైనిక్‌స్కూల్‌లతో పాటు మరిన్నీ కళాశాలలు నిర్మించడం జరిగిందని జనాభా పెరుగుదల కు అనుగుణంగా పేదలకు, ప్రజలకు వంద పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. పీలేరు, వాల్మీకిపురం, కలికిరి పట్టణాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ సెంటర్ లేక ప్రజలు రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బాధితులు మదనపల్లి, తిరుపతి, వెలూరుకు ప్రయివేట్ వాహనాలు తీసుకుని వెళ్లడం వలన ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కలికిరిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడి ప్రజలకు ఆదుకోవాలని ఆయన అసెంబ్లీలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కోరారు.



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

# ఎల్‌ఎల్‌బి పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం, డిగ్రీ ఎల్.ఎల్.బి సెమిస్టర్‌ల పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్త పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి కృష్ణారావు, సహాయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస రావుతో కలిసి విడుదల చేశారు. వైవీయూలోని తన ఛాంబర్‌లో ఫలితాల విడుదల సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌ఎల్‌బి (ఫైవ్ ఇయర్స్) రెండో సెమిస్టర్ లో 67 మంది, నాలుగో సెమిస్టర్‌లో, 9 మంది, ఆరో సెమిస్టర్ లో 59 మంది, ఎనిమిదో సెమిస్టర్‌లో 53 మంది, పదో సెమిస్టర్‌లో 108 మంది ఉత్తీర్ణతసాధించారని చెప్పారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.



లక్కిరెడ్డిపల్లి : మాట్లాడుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

## గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి: ఎంపిపి

**ప్రజాశక్తి-వీరబల్లి**

ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులు గ్రామ అభి వృద్ధికి తోడ్పడాలని ఎంపిపి రాజేంద్ర నాథ్‌రెడ్డి, ఎంపిడిఒ నూర్జహాన్‌లు తెలి పారు. గురువారం మండలంలోని ఎంపి డిఒ కార్యాలయంలో సర్పంచులు, ఎంపి టిసిలకు, వెలుగు సిబ్బందికి, ఉపాధి హామీ ఇబ్బందికి, గ్రామాల అభివృద్ధి, నిధుల ప్రణాళిక, గ్రామ సభల నిర్వహణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ఎంపిడిఒ నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావే శానికి ఎంపిపి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు ఎక్కువ మొత్తంలో చేపట్టి ప్రజలకు పనులు కల్పించాలని తెలిపారు. గ్రామాలలో నిర్వహించేటువంటి అభివృద్ధి పనులు ప్రజలకు మేలు జరిగేటట్లు ఉండాలని ఆయన సూచించారు. అందుకు తగు విధంగా ప్రణాళికలను తయారు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ఇర్ఫాన్, ఎపిఎం భాదరవల్లి, హౌసింగ్ ఎఇ వెంకటేష్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం తప్పనిసరని లక్కిరెడ్డిపల్లె ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, జడ్‌పిటిసి రమాదేవి గురువారం స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ఉపసర్పంచ్‌లతో కలిసి గ్రామాల అభివృద్ధిపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనే భాగంగా ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి అన్నారు. లక్కిరెడ్డిపల్లె మండ లంలో తీవ్ర వర్షాభావం నెలకొన్న పరిస్థితిలో తాగునీటి ఇబ్బందుల అధికంగా ఉన్నందున సర్పంచులు గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపి పంచాయతీ నిధులను దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాల న్నారు. గ్రామాలలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. **గాలివీడు:** స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ సి.జవహర్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ జి.కృష్ణ ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, అధికారులు పలువురు పాల్గొన్నారు. **రామాపురం:** 2025–26 సంవత్సరానికి సంబంధించి ఎంపిపి, జడ్‌పిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు గ్రామ అభివృద్ధి కొరకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడానికి శిక్షణ తరగతులను ఉపయోగించుకోవాలని ఎంపిడిఒ జాషువా అన్నారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో గురువారం గ్రామాల అభివృద్ధి కొరకు ప్రణాళికల ఒక్కరోజు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కావలసిన మౌలిక సదుపాయాలపై ప్రణాళికలను సిద్ధం చేయాలని వారికి సూచించారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, తదితర మౌలిక వసతుల అంశాలపై నివేదిక ఇవ్వాలని తెలిపారు.కార్యక్రమంలో డిఎల్‌డిఒ లక్ష్మీపతి, ఎఇ చాంద్‌బాషా, సర్పంచ్‌లు నాగభూషణ్ రెడ్డి, వెంకటరెడ్డి, ధన పాల్గొన్నారు. **చిన్నమండెం:** మండల ప్రజా పరిషత్ సభా భవనంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి ఒకరోజు ట్రైనింగ్ ప్రోగ్రామును నిర్వహించారు. ఈ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా డిఎల్‌డిఒ రాయచోటి లక్ష్మీపతి హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, ఎపిఒ, పంచాయతీరాజ ఎఇ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ, వెటర్నరీ డాక్టర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ప్రజానాయకుడిపై విమర్శలు చేస్తే సహించం

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతున్న మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాపై అర్థరహితమైన విమర్శలు చేస్తే సహించేదిలేదని టిడిపి మండల మాజీ అధ్యక్షులు రాజన్న అన్నారు. గురువారం నిమ్మనపల్లెలో టిడిపి నాయకులతో కలసి ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేపై కొందరు అర్థరహితమైన విమర్శలు చేస్తున్నారని వాటిని మానుకోవాలన్నారు. గత ఎన్నికల్లో భాగంగా టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడిన నాటి నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ విజయానికి ఐకమత్యంతో శ్రమించిన అన్నారు. ఎన్నికలలో గెలుపొందిన నాటి నుంచి వందలాది మంది కార్యకర్తలతో, నాయకులతో, ప్రజలతో ప్రతిరోజూ వ్యక్తిగతంగా కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ అండగా నిలుస్తున్నారని అన్నారు. గత 15 సంవత్సరాలుగా మదనపల్లె నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే లేరని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో షాజహాన్‌బాషా విజయంతో పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని అన్నారు. నియోజకవర్గ ప్రజానాయకులుగా దగ్గరుండి అభివృద్ధి పనులను చేపడుతూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్న తరుణంలో ఆయనను చూసి ఓర్వలేక కొంతమంది అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా, కుల, మతాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీపతి, శ్రీనివాసులు రెడ్డి, మైనారిటీ నాయకులు కాసిం ఖాన్, సర్పంచులు రెడ్డప్ప, నిర్మల, మాజీ ఎంపిటిసి రెడ్డప్ప పాల్గొన్నారు. లక్ష్మి, సరోజమ్మ, రత్నమ్మ, అంజుమ్ సుల్తానా పాల్గొన్నారు.

## అంధకారంలో గ్రామాలు

**-పట్టని విద్యుత్‌శాఖ అధికారులు**

**ప్రజాశక్తి-చిట్వేలి :** మండల పరిధిలోని కంప్యూరుపల్లి, బిద్దనపల్లి, ఎం.రాజుపల్లి, గిరిజనకాలనీ తదితర గ్రామాల్లో గత నెల రోజులకు పైగా వీధిలైట్లు వెలగక పోవడంతో గ్రామాలు చిమ్మ చీకటిలో ఉంటున్నాయి. వీధి దీపాల సమస్యల గురించి ఆయా సంబంధిత లైన్‌మెన్, మండల విద్యుత్ శాఖ అధికారి దృష్టికి తీసుకెళితే తమకు సంబంధం లేదని సమాధానం ఇస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధి పురుగులు సంచరిస్తుండటంతో రాత్రి వేళల్లో ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంగా ఉందని అంటున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా సచివాలయ సిబ్బందితోపాటు మండల అధికారులు సైతం నిమ్మకు నిరుత్తినట్లు వ్యవహరిస్తున్నారు ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని అన్నారు. మండల పరిధిలో సర్పంచ్‌లు గత పాలనలో ఉన్న వారు కావడం వలన వారే కొనసాగుతున్న కారణంగా అభివృద్ధి విషయంలో పూర్తిస్థాయిలో ముందుకు రాలేపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంధ కారంలో ఉన్న గ్రామాల్లో వీధి దీపాలను మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

## పంటల బీమాపై అవగాహన

**ప్రజాశక్తి-వాల్మీకిపురం:** వాల్మీకిపురం డివిజన్ పరిధిలోని రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్యాలయ ఎడిఎ మజీద్ అహ్మద్ అన్నారు. గురువారం స్థానిక వాల్మీకిపురం 1 రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే వరి, వేరుశనగ, టమోటా పంటలకు బీమా నమోదు తదితర కార్యక్రమాలను తెలిపారు. రబీ సీజన్‌లో పంటలబీమా పిఎంఎఫ్‌బివై కింద వరి పంటకు ఎకరానికి రూ.126 ప్రీమియంను డిసెంబరు 31లోపు, వేరుశనగ పంటకు ఎకరానికి రూ.96, టమోటా పంటకు ఎకరానికి రూ.1600లు ప్రీమియంను రైతులు డిసెంబరు 15లోపు చెల్లించే విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎడిఎ వాణిశ్రీ, ఎఒ హేమలత, రమేష్‌రాజు, వెంకటమోహన్, రామకృష్ణరాజు, రత్నమ్మ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

**ప్రజాశక్తి-గాలివీడు**

మండల పరిధిలోని కుషావతీనది సమీపంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కరుమల జలీల్‌బాషా అనే వ్యక్తి డిఆర్‌ఒ మధుసూదన్ కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుషావతినది సమీపంలో ఎడమ చేతి వైపు ఉన్న సర్వేనెంబర్ 1056/2 లో 31 సెంట్లు ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఈ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఒను కలిసి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఈనెల 7న కలెక్టర్‌ను కూడా కలిసి వినతిపత్రం సమర్పించామని డిఆర్‌ఒ దృష్టికి తీసుక వెళ్లడంతో తహశీల్దార్‌ను సంప్రదించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని అన్నారు.

# నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు : డిప్యూటీ డిఇఒ




రాయచోటి:నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డిప్యూటీ డిఇఒ, ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి-కలకడ**

నవభారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ పేరుగాంచారని ఆదర్శ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోనలో ఘనంగా పిల్లల దినోత్సవం నిర్వహించారు. కోన ఈ ప్రధానోపాధ్యాయులు చెంగల్ రాయుడు మాట్లాడుతూ భారత దేశానికి మొదటి ప్రధాన మంత్రి గా పని చేసిన నెహ్రూ పంచవర్ష ప్రణాళిక ద్వారా భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేశారని అన్నారు. నెహ్రూను ఆదర్శంగా తీసుకొని పిల్లలందరూ సమాజ అభ్భివృద్ధికి కృషి చేయాలని కోరారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వ హించి విజేత లకు బహు మతులు అందిచారు..ఈ సమావేశంలో ఆదర్శ పాఠశాల వైస్ చైర్మన్ అక్బర్ అలీ, ఎస్ఐ రామాంజ నేయులు, ప్రిన్సిపల్ మలంగ్ షావలి వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర, ఉపాధ్యాయులు శివారెడ్డి,మహేశ్వరి,నాగ ముని నాయక్, షౌకత్ అలీ,రమేష్ రెడ్డి,నౌషాద్ బేగం, గఫార్ ఖాన్, సైరాబాను,కిరణ్ కుమార్ పాల్గొన్నారు. **సంబేపల్లి/రాయచోటి** నేటి తరగతి గదులలో రూపుదిద్దుకుంటున్న బాలలే రేపటి దేశ భవిష్యత్తుకు దిక్సూచికలని రాయచోటి ఉప విద్యాశాఖాధికారి శివ ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం సంబేపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలల నేస్తం చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నెహ్రూకు పిల్లలన్నా, గులాబీలన్నా అమితమైన ప్రేమ అని ఆయన ఎక్కడికెళ్లినా పిల్లలను దగ్గరగా తీసుకొని ఆప్యాయంగా పలకరించేవారని అన్నారు. అందుకే ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకుం టున్నామని తెఇపారు. స్వతహాగా రచయిత అయిన నెహ్రు తన కుమార్తెకు రాసిన ఉత్తరాల్లో పిల్లలు ఎలా ఉండాలి ఎలాంటి విషయాలు నేర్చుకోవాలి, సమాజంలో మంచి, చెడులను ఎలా గ్రహించాలి సమస్యలను ఎలా అధిగ మించాలి తదితర అంశాలను కూలంకషంగా వివరించారు. పిల్లల బాల్యం వారి జీవితంలో అత్యంత విలువైనదని వారికి సరైన మార్గద ర్శకత్వం, ప్రేమ, పాఠశాల విద్యను అందించడంతో పాటు, వారిలో సృజనా త్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం తోపాటు వివిధ క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ రెడ్డి రాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.**పుల్లంపేట :** మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ భారతదేశ ప్రథమ ప్రధానిగా నెహ్రూ దేశ అభివృద్ధి కోసం పంచవర్ష ప్రణాళికలు, పంచశీల వంటి ఎన్నో గొప్ప పనులకు శ్రీకారం చుట్టారని తెలియజేశారు. నెహ్రూకి పిల్లలంటే ఇష్టం కాబట్టి వారి పుట్టినరోజున నవంబర్ 14న పిల్లల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. **రాజంపేట అర్బన్ :** నేటి బాలలే రేపటి పౌరులని లయన్స్ క్లబ్ అధ్యక్షులు నరసింహారాజు, జిల్లా చైర్మన్ పోతుకుంట రమేష్ నాయుడు తెలిపారు. 6వ వార్డు ఎంపిపి పాఠశాలలో గురువారం జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట వారి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి పిడికిటి సంతోష్ సహకారంతో విద్యార్థులకు విద్యాసామగ్రి, మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని.. విద్యార్థిని, విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం నేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎడిగెట్టి నాగేశ్వరరావు, షేక్ అబ్దుల్లా సీనియర్ నాయకులు మాజీ రీజన్ చైర్మన్ మద్దిపట్ల రామకృష్ణ నాయుడు, మాజీ జోన్ చైర్మన్ ఆర్య వెంకటసుబ్బయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ పాల్గొన్నారు.**పీలేరు:** మండలంలో బాలల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో భారతదేశ ప్రప్రథమ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ముందుగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు ప్రధానం చేశారు. స్థానిక అజంతా టాకీస్ రోడ్డులోని అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కె. చిన్నమ్మ, సహాయకురాలు రాబియా ఖాదీర్, విద్యార్థులు పాల్గొన్నారు.




కలకడ : విద్యార్థిని బహుమతి అందిస్తున్న ఎస్ఐ

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



కలకడ : ర్యాలీ చేపట్టిన విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది

**ప్రజాశక్తి-పీలేరు:** విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రజలు విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాల సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వక్తలు తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం పీలేరు ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో గ్రంథాలయాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా బాలల దినోత్సవం పురస్కరించుకుని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జయంతి వేడుకను ఘనంగా జరిపారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు, యువత మనోవికాసానికి ఉపయోగపడే ఎన్నో రకాల పత్రికలు, పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గ్రంథాలయాలను ప్రతి వయసు వారు సద్వినియోగం చేసుకోవడానికి వెసలు బాటు ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు నరసింహులు, రెడ్డి కుమారి, బేబమ్మ, గ్రంథాలయ అధికారి అమర్నాథ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగాలని స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గ్రంథాలయాలతో విద్యార్థుల మేధోశక్తి పెరుగుతుం దని అన్నారు. ప్రతిరోజు గ్రంథాలయాలను సందర్శించి వార్తాపత్రికలు, పుస్త కాలు పఠనం చేయడం ద్వారా విజ్ఞానం సంపాదించుకోవచ్చని అన్నారు. ఈనెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి అమరనాథ తెలిపారు. బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథ పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండల కేంద్రమైన వీరబల్లి గ్రంథాల యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి విజయలక్ష్మి తెలిపారు. గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారో త్సవాలు, బాలల దినోత్సవం పురస్కరించుకొని గ్రంథాలయ ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాల పై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ముందుగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యా యులు రెడ్డప్ప రెడ్డి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** జాతీయ బాలల దినోత్సవం,మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ ఆదేశాల మేరకు పిటిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు క్రీడలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేసినట్లు ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సూరి నాయకులు శంకర,రామాంజులు, రాము, పవన్ స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహులు, ప్రధానోపాధ్యాయులు ఎ.అపర్ణాదేవి, ఉపాధ్యాయులు కమల్, విజయ కుమార్, రమణ, రాధ, అశోక్ రెడ్డి, లక్ష్మినారాయణ, రామక్రిష్ణ,రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మదనపల్లి శాఖ గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఆర్.వసంత కుమారి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మునుగోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్ రెడ్డి, రాజగోపాల్ హాజరయ్యారు.ఈ సందర్బంగా ఎంఇఒలు మాట్లాడుతూ పిల్లలు బాల్యం నుంచి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. డిఎస్‌సి అభ్యర్థుల కోసం 3 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను గ్రంథాలయానికి అందిస్తామని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత టిఎస్ఎ కృష్ణమూర్తి, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, సహదేవరావు, సుధాకర్, నాగరాజ, కామకోటి ప్రసాదరావు, భవాని ప్రసాద్, రెడ్డప్ప, జబ్బార్ పాల్గొన్నారు.**కలికిరి :** స్థానిక గ్రంథాలయం కలికిరిలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంపియుపి స్కూల్ విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పుస్తక ప్రదర్శన జరుగుతుందని ఈ పుస్తక ప్రదర్శనకు అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు కళాశాలలో ప్రజలు పాఠకులు హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరారు. **తంబళ్లపల్లి :** తంబళ్లపల్లి శాఖ గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటకుమార్, గ్రంథాలయ అధికారి జిలానీబాషా, పాఠకులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నేటి బాలలే రేపటి బావి భారత పౌరులని, వారికి విద్య తో పాటు శారీరక మానసిక వికాసం కొరకు క్రీడల్లో సాంస్కృతిక కార్యక్రమాల అవసరం ఎంతైనా ఉందని ప్రిన్సిపల్ వి.రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ నాగ నవీన్‌కుమార్ సుబ్బరాయుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గాలివీడు :** గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా 15న పుస్తక ప్రదర్శన, 16న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న డ్రాయింగ్ పోటీలు, 19న మహిళలకు ముగ్గులు నిర్వహించబడునని గ్రంథాలయ అధికాఇ రామచంద్రనాయక్ తెలిపారు.



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

## సిసి రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి :పీడీ

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

సిసి రోడ్ల నిర్మాణాలలో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండయ్యగారిపల్లెలో పల్లె పండుగ ద్వారా వేసిన సిసి రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్తయిన సిసి రోడ్లకు త్వరగా బిల్లులు చెల్లించాలని ఎపిడి శ్రీనివాసులు, ఎపిఒ రమేష్‌లను ఆదేశించారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో పల్లె పండుగ ద్వారా రూ.1.50 కోట్లతో 40 పనులు మంజూరయ్యాయని అన్నారు. అందులో 14 పనులు పూర్తికాగా, 25 పనులు జరుగుతున్నాయని అన్నారు. మరోచోట పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. కొండయ్యగారిపల్లెలో రూ.7.5 లక్షలతో 202 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కలికిరి క్లస్టర్ ఉపాధి హామీ ఎపిడి శ్రీనివాసులు, నిమనపల్లె ఎపిఒ రమేష్ పాల్గొన్నారు.

## జీవ సాంకేతికతపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి - కడప**

విద్యార్థులు జీవ సాంకేతిక శాస్త్రంలో జన్యుపునః సంయోజక మొక్క లపై జరుగుతున్న పరిశో ధనలు, క్షేత్రస్థాయి ఫలితాలు, సాధిం చిన ప్రగతి వంటి అం శాలపై అవగాహన కలిగి ఉంటే ఉన్నత విద్యలో మరిం తగా రాణించగలరని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ స్టార్ స్టేటస్ కార్యక్రమంలో భాగంగా గురు వారం నిర్వహించిన కార్యక్రమంలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర ఆధ్యాపకులు పి. వెంకట కృష్ణారెడ్డి జీవ సాంకేతిక శాస్త్రంలోని ప్రగతి పై విద్యార్థులకు ప్రత్యేక అతిథి ఉపన్యాసం చేశారు. 'జన్యుపునఃసంయోజక మొక్కలు ఉత్పత్తి, వాటి ఉప యోగాలు' అనే అంశం పై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహిం చారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణ వల్ల జన్యుపున సంయోజక మొక్కల ఉత్పత్తి చేయు విధానాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం. వి. సురేష్ బాబు, తిలక్ విద్యాసాగర్, శివరామకృష్ణ, డాక్టర్‌నీలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



వెంకటకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న వైస్ ప్రిన్సిపల్



అవార్డు అందుకుంటున్న మల్లు సుబ్బ నరసారెడ్డి

## ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా వెంకటరమణ

**ప్రజాశక్తి-రామాపురం**

అన్నమయ్య జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా నియమితులయ్యారు. మండలంలోని చిట్లూరు దళిత వాడికి చెందిన జి.వెంకటరమణ గురువారం విజయవాడలో రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మంత్రి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి తనపై నమ్మకంతో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో మెంబర్‌గా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన మండల నాయకులు గాలివీటి సురేందర్‌రెడ్డి, ఎన్ దేవదర్శన్ రెడ్డి, మాన్నూరి చెన్న కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి రామకృష్ణ గౌడ్, మురళీకృష్ణకఉ ధన్యవాదాలుతెలిపారు.

## విభిన్న ప్రతిభావంతుల సేవకు సత్కారం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

జిల్లా కేంద్రం రాయచోటిలోని సోమలరాజు ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మదర్ థెరిసా బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డును గురువారం పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ద్వారా తాము చేసిన సమాజసేవలో భాగంగా సోమరాజు ఫౌండే షన్ మా సంఘాన్ని గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు అందు కోవడం వల్ల సమాజంలో మాసంఘ సభ్యులకు మరింత బాధ్యత పెరిగిం దని అన్నారు. సమాజ సేవ చేయడానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్క దాతకు మా అందరి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. భవిష్య త్తులో మరిన్నీ సేవా కార్యక్రమాలను చేయడానికి ముందుకు వెళ్తామని తెలిపారు.

## ఆక్రమణలు తొలగించేందుకు రంగం సిద్ధం

**- మార్కింగ్ వేయించిన నగర పంచాయతీ అధికారులు**

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**



మార్కింగ్ వేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు


పట్టణంలో ఆక్రమణలు కూల్చివేతకు రంగం సిద్ధం చేశారు. మంగళవారం పట్టణంలో అన్ని దుకాణాలు, భవనాల వారికి ఆక్రమ ణలు తొలగిం చుకోవాలని సూచించిన సంగతి విధితమే. గురువారం కాలువలు అవతలి వైపుకు తొలగించుకోవాలని నగర పంచాయతీ కార్మికుల చేత మార్కింగ్ వేశారు.రెండు రోజుల్లోగా ఆక్రమణలు తొలగించుకోకుంటే పోలీసు అధికారుల సహకారంతో కూల్చివేస్తామని నగర పంచాయతీ అధికారులు తెలిపారు. డ్రెయినేజీ కాలువలపై అక్రమంగా దుకాణాలు నిర్వహిస్తుండడం వలన పట్టణంలో విపరీతమైన ట్రాఫిక్ ఏర్పడుతోంది.ఈ సమస్యకు పూర్తిగా పరిష్కారం లభించకపోవడం, దుకాణదారులు,భవన యజమానులు సహకరించిపోవడంతో ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధమైనట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

## 19న ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

**ప్రజాశక్తి-తంబళ్లపల్లె :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, మరియు సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో 19న టిఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరి యల్ ప్రభుత్వ ఐటిఐ కళాశాల, తంబళ్లపల్లెలో జాబ్‌మేళా నిర్వహించబడుతుందని ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్ ,(జూనియర్ రిలేషన్షిప్ ఎగ్జిక్యూటివ్) అమర్ రాజా, అపోలో ఫార్మశీ ప్రతినిధులు పాల్గొంటాని చెప్పారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయసు గల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. యువకులు తమ బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫోటోతో 19న 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.వివరాలకు ఈ నెంబర్ 9618655759 సంప్రదించాలని కోరారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి- రైల్వేకోడూరు:** స్థానిక పట్టణంలోని లీలావతి ఆసుపత్రిలో వైద్యులు డాక్టర్ దామోదర్‌రెడ్డి, డాక్టర్ సాహిత్య ఆధర్వంలో చిన్నారులకు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ముఖ్యంగా చిన్నారులకు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్త పరీక్షలు, హిమోగ్లోబిన్, బిపి తదితర పరీక్షలను నిర్వహించి అవసరమున్నవారికి, ఉచిత మందులను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 14 చిల్డ్రన్స్‌డే, డయాబెటిక్ డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ఎంతో మంది పేదలకు చిన్నారులకు వైద్య సేవలు అందజేసి వారి మన్ననలు పొందామని తెలిపారు.అత్యవసర సమయాలలో కూడా తమ ఆసుపత్రి అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దామోదర్‌రెడ్డి

# క్రైం కార్నర్

## భవననిర్మాణ కార్మికుడిపై హత్యాయత్నం

**-కత్తితో పొడిచిన యువకుడు**

**ప్రజాశక్తి మదనపల్లె అర్బన్**

భవన నిర్మాణ కార్మికుడిపై ఓ యువకుడు కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం మదనపల్లి పట్టణంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. స్థానిక రింగ్ రోడ్డు గొల్లపల్లి కు చెందిన వీరాస్వామి భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. యధాప్రకారం ఇంటి నిర్మాణ పనుల్లో ఉన్న వీరాస్వామి పై సమీప బంధువు రాందాస్ కుమారుడు భగవాన్ కత్తితో వెనుక నుంచి అతని వీపుపై పొడిచి పరారయ్యాడని చెప్పారు. స్థానికులు వెంటనే బాధితున్ని జిల్లా ఆసుపత్రికి తరలించారని అన్నారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స చేసి శరీరంలోకి దూసుకు పోయిన కత్తిని బయటకు తీశారని,. తీవ్ర రక్తస్రావంతో పాటు బాధితుని పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారని చెప్పారు. బంధువైన భగవాన్ పూటుగా మద్యం తాగి వీరాస్వామి పై కత్తితో పొడవడం పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కుటుంబ సభ్యులు మాత్రం వారికి, మాకు ఎలాంటి తగాదాలు లేవని, ఆస్థి గొడవలు కానీ, పాత కక్షలు ఏమీ లేవని చెప్పారు. మరి భగవాన్ ఎందుకు ఇంతటి దుస్సాహానికి పాల్పడ్డాడనేది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది. ఈ మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.